క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాలో శనివారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ భూక్యా సుధాకర్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర, పాలేరు, కోదాడ, ఏపీలోని జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయిలో లెవన్ స్టార్ క్రికెట్ అసోసియేషన్, కందాళ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఏదులాపురం సొసైటీ చైర్మన్ ఎన్నిక

ఖమ్మంరూరల్: ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ ఎన్నిక నేడు(శనివారం) జరగనుంది. గతంలో ఉన్న చైర్మన్‌పై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు అప్పటి చైర్మన్‌ను తొలగించి వైస్ చైర్మన్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సంఘంలో ఉన్న 13 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నిక చేయడం కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే చైర్మన్ పదవి కోసం ముగ్గురు డైరెక్టర్లు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో 20 నెలల కాల వ్యవధి కోసం ఈ ఎన్నిక అనివార్యమైంది.

రేపు 'పొంగులేటి' ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన ఖమ్మం నియోజకవర్గ స్థాయి అభిమానుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైరా రోడ్డులోని ఎస్‌ఆర్ గార్డెన్స్ వెనుకాల ఖాళీ స్థలంలో ఈ సమ్మేళనం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

21న మంత్రి అజయ్‌కు కృతజ్ఞత సభ

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం 23 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం జరిగేలా కృషి చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఈనెల 21వ తేదీన కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జెడ్పీ హాల్‌లో జరిగే సభకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దుర్గాప్రసాద్‌కు సన్మానం

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ రెండోసారి నియామకం కావటం పట్ల పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొందయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుల ఆందోళన

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు క్రాస్ రోడ్డు వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. వరంగల్ రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించగా, తిరుమలాయపాలెం సొసైటీ చైర్మన్ చావా వేణు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పిండిప్రోలు, తెట్టెలపాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

నేలకొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మండలంలోని క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు మరింత అప్రమతంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి ఉన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	20		10
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	50		10
కాకర	46	చుక్కకూర	2
బీర	40		10
సొరకాయ	20	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	50		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

ఫిర్యాదు చేసేదెలా..?



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

రేషన్ దుకాణాల్లో కానరాని ఫిర్యాదుల పెట్టె

- అధికారుల ఆదేశాలు ఖాతరు చేయని డీలర్లు
- ప్రభుత్వ ఆదాయానికి తూట్లు
- నేటికీ అదొకటి ఉంటుందని తెలియని ప్రజానీకం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నేలకొండపల్లి: ప్రభుత్వ రేషన్ దుకాణాల వద్ద నిల్వలు ఉన్నప్పటికీ లేవని చెప్పడం.. బియ్యాన్ని పక్కదారి పట్టించడం.. చౌక ధరల దుకాణాలను సక్రమంగా నిర్వహించకపోవడం లాంటి సంఘటనలకు స్వస్తి చెప్పడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందుకోసం ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రేషన్ దుకాణాల్లో నిల్వలు, ధరల వివరాలను బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయినా పాలేరు నియోజకవర్గంలో ఉన్న దాదాపు 150 ప్రభుత్వ చౌక దుకాణాల్లో ఇలాంటి ఫిర్యాదుల పెట్టేలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ప్రజలు సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఏమేమీ రాయొచ్చు..

రేషన్ దుకాణాల్లో ఎలాంటి ఇబ్బంది ఉన్నా.. ఫిర్యాదు రాసి పెట్టెలో వేయొచ్చు. సమయపాలన పాటించకున్నా, ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో సరుకులు పంపిణీ చేయకపోయినా, బయోమెట్రిక్ సమస్యలు, కాంటాలో ఇబ్బందులు, సరుకు నిల్వల వివరాలు లేకపోయినా వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చు. తనిఖీలకు వచ్చే ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, తహసీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వాటిని చదివి సమస్యను అక్కడిక్కడే పరిష్కరిస్తారు.. అవసరమైతే డీలర్లపై చర్యలు తీసుకుంటారు.

ఆదేశాలు బేఖాతరు..

ఫిర్యాదుల పెట్టే సరుకుల నిల్వలు ధరల పట్టిక వంటివి పెట్టాలనే నిబంధన కొత్తదేమీ కాదు. రేషన్ వ్యవస్థ ప్రారంభమైన కొత్తలో ఇలాంటివి కనిపించేవి. కాలక్రమేనా అటు డీలర్లు, ఇటు అధికారులు మరిచిపోయారు. కొన్నిచోట్ల డీలర్‌కు సంబంధించిన వివరాలు కనిపించవు. ఈ నేపథ్యంలో అధికారులు పాత నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదుల రిజిస్టర్, డీలర్ వివరాలు, టోల్ ఫ్రీ, సంబంధిత తహసీల్దార్ ఫోన్ నంబర్లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు కానీ ఎక్కడా అమలు కావటం లేదు. చాలా మందికి అదొకటి ఉంటుందని తెలియకపోవడం గమనార్హం.

ఏర్పాటు చేయాల్సిందే..



పాలేరు డివిజన్‌లో ఉన్న ప్రతీ ప్రభుత్వ చౌకదుకాణంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాల్సిందే. అధికారులు ఏర్పాటు చేసే వరకూ చర్యలు తీసుకోవాలి. ప్రజల హక్కును కూడా హరిస్తున్నారు. పేదలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బట్టపోతుల ప్రకాశం, వినియోగదారుల ఫోరంసభ్యుడు, నేలకొండపల్లి

ఇంత వరకు నాకు తెలియదు..



రేషన్ దుకాణాల్లో ఫిర్యాదుల పెట్టే ఉంటుందని ఇంతవరకు నాకు తెలియదు. ప్రభుత్వం అందించే సరుకులు, నిల్వలు ప్రజలకు తెలియాలి. ఏదైనా సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేసేలా చూడాలి.

– కాశిబోయిన అయోధ్య, సింగారెడ్డిపాలెం

నిబంధనలు పాటించాల్సిందే..



నిబంధనలు మేరకు ప్రతీ రేషన్ దుకాణంలో ధరల పట్టిక, సరుకుల నిల్వ వివరాలు, ఫిర్యాదు పెట్టెలను ఉంచాలి. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. ఏదైనా సమస్యలు ఉంటే.. నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. తద్వారా విచారించి సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుంది.

– దారా ప్రసాద్, తహసీల్దార్, నేలకొండపల్లి

ట్యాంక్‌బండ్.. సబ్బండ కులాల సొత్తు



మాట్లాడుతున్న జ్వాలా నర్సింహారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ట్యాంక్‌బండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహ స్థానంలో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహాత్ముల విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై హైకోర్టు స్టే విధించినప్పటికీ విగ్రహ ఏర్పాటును ఆపకుండా.. ఒంటెద్దు పోకడకు పోయి ముప్పు తెచ్చుకోవద్దని హితవుపలికారు. సబ్బండ కులాల అభివృద్ధి మ్యానిఫెస్టోగా అధికారంలోకి వచ్చి కేవలం ఒక్క కులానికి ప్రతినిధిగా వ్యవహరించడం మంచిదికాదని, ట్యాంక్ బండ్ సబ్బండ కులాల సొత్తని గుర్తు చేశారు.

విగ్రహ ఏర్పాటుకు యాదవుల మద్దతు..

యాదవుల మనోభావాలు దెబ్బతినకుండా కృష్ణుడి రూపం తొలగించి ఎన్టీఆర్ విగ్రహ స్థాపనకు జిల్లా యాదవ సంఘం మద్దతు పలికింది. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జ్వాలా నర్సింహారావు మాట్లాడిన అనంతరం మంత్రి పువ్వాడకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మాదుగుల పెద్ద వెంకటేశ్వర్లు, వల్లపు వెంకటేశ్వర్లు, నరసింహారావు, మాడుగుల శ్రీను, జాల శ్రీను, జాల కిట్టు, మధు, అనసూర్య, మణి, సుగుణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాజేందర్

కూసుమంచి: వచ్చే నెల 5, 6 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న పీవైఎల్ రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని జుజుల్‌రావుపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, మత విద్వేషాలు రెచ్చగొట్టి హిందుత్వ ఫాసిజాన్ని పెంచి పోషిస్తుందని విమర్శించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం నిధులు, నీళ్లు, నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చి మాట తప్పిందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మోకాళ్ల రమేష్, న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి కె.సురేష్, పీవైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాట్ల నాగేశ్వరావు, ఏనుగుల సుధాకర్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కల్పన, నాయకులు నగేష్, గిరి, వెంకన్న, సురేష్, వేణు, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో గత మూడు రోజులుగానిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగుతోంది. శుక్రవారం మేజిషియన్ పీవీ అప్పారావు, ఎస్‌ఆర్ పురుషోత్తం, ఎం.రాజయ్య, నాగేంద్ర టీమ్ పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పంజాల ఐలయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు రాములమ్మ, అలవాల నాగేశ్వరరావు, ఎల్‌వీ రెడ్డి, మల్లెంపాటి వీరభద్రరావు, శివనారాయణ, రామారావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.65 వేల దాణా వితరణ



దాణా వితరణలో సేవా సమితి ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: బహుళ అమావాస్యను పురస్కరించుకొని శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాలకు రూ.65 వేలు విలువ చేసే గోదాణాను శుక్రవారం వితరణ చేశారు. ఖమ్మం నగరంలోని దాల్ మిల్లుల యజమానుల, స్తంభాద్రి సేవా సమితి సభ్యుల సహాయ, సహకారాలతో మినప, పెసర, కంది, బొబ్బెర చున్నీలు, తవుడు, బెల్లం, ఆకుకూరలు, కూరగాయలు, అరటి పండ్లను సేకరించి గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సభ్యులు జంగిలి రమణ, సూరినేటి మల్లేశం, పెనుగొండ సాయికిరణ్, సోమారపు సుధీర్‌కుమార్, పులిపాటి సంపత్‌కుమార్, కుమ్మరికుంట్ల మురళి, వంగవీటి శ్రీనివాసరావు దంపతులు, కల్వకుంట్ల శ్రీనివాసరావు, దన్నారపు రమేష్, గోశాల నిర్వాహకులు ఓం నారాయణ ఖండేల్‌వాల్, మహేందర్ చౌదరి, నందుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్–3 ఏఈ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరారోడ్, కవిరాజనగర్, బైపాస్ రోడ్, వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, కోర్టు ఏరియాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు.

టౌన్–1 పరిధిలో...

నగరంలోని టౌన్–1 పరిధిలోని గాంధీచౌక్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ముందు విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ మౌల్విక ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతం, సాయిరాం థియేటర్ ప్రాంతం, మోతీనగర్, బొక్కల గడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఆటో స్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీచౌక్, పీఎస్‌ఆర్ రోడ్, సుందర్ టాకీస్ రోడ్, గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్ రోడ్, జహీర్‌పుర, బోసు బొమ్మ సెంటర్, మంచికంటి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

టౌన్–2 పరిధిలో...

నగరంలోని 33/11 రామాలయం సబ్ స్టేషన్, కమాన్ బజార్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కమాన్ బజార్, కస్బా బజార్, వల్లాల వారివీధి, షాదీఖానా ప్రాంతం, స్టేషన్ రోడ్ ఏరియా, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్ ఏరియా, వినోద థియేటర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతం, జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలపేట, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కైకొండాయిగూడెం, గణేష్‌టౌన్‌షిప్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే, నగరంలోని ఖానాపురం, రోటరీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సబ్ స్టేషన్ల పరిధిలోని శ్రీనగర్ కాలనీ, వైరా రోడ్డు, చైతన్యనగర్, గోపాలపురం, పుట్టకోట, గొల్లగూడెం, రోటరీనగర్, గొల్లగూడెం రోడ్డు, పోలీస్ కాలనీ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ రమేష్, ఖమ్మం అర్బన్ ఏఈ అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని గోపాలపురం పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పరీక్షలు చేయించుకొని ఉచితంగా అందించే కళ్లద్దాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ లకావత్ సైదులు, సుడా డైరెక్టర్ దైవభక్తుని కిషోర్, సిటీ లైబ్రరీ డైరెక్టర్ గొల్లపూడి రాంప్రసాద్, ఎస్టీసెల్ నగర అధ్యక్షుడు వాంకుడోతు సురేష్, అశోక్, వీరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.అలాగే 1వ డివిజన్‌లో సుడా నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాల సందర్శన..



శిబిరంలో చిన్నారులతో మేయర్ నీరజ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో శుక్రవారం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను పొందుతున్న తీరును మేయర్ నీరజ పరిశీలించి.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిపై అధికారుల ఆరా



విచారణ చేస్తున్న ఆర్‌ఐ ప్రసాద్

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని శ్రీశ్రీశ్రీ బాల ఆంజనేయ దేవస్థానానికి గ్రామానికి చెందిన రామయ్య, మంగయ్యలు ఇచ్చిన భూమి ఆక్రమణ గురవుతున్నట్లు ఇటీవల స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టగా.. దాతలు ఒక ఎకరం 20 కుంటలు భూమిని గుడికి ధూపదీప నైవేద్యం కింద ఇచ్చారని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. అంతేకాక ఆ భూమిలో కొంత భాగం భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రెవెన్యూ రికార్డులో నమోదు చేశారని చెప్పారు. దీనిపై వాస్తవాలు తెలుసుకునేందుకు ఆర్‌ఐ ప్రసాద్ విచారణ చేపట్టి భక్తుల నుంచి పలు అంశాలపై వివరాలు సేకరించారు.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజ్‌లకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా ముదిరాజ్ సంఘం ఫౌండర్ కాశబోయిన అనంతరాములు, ముదిరాజ్ సంఘ జిల్లా నాయకుడు మామిడి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్‌గా పిట్టల రవీందర్‌ను నియమించడం పట్ల కేసీఆర్‌తో పాటు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ముదిరాజులు రుణపడి ఉంటారన్నారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ విలేకరుల సమావేశంలో పిట్టల నాగేశ్వరావు, పిట్టల వెంకటనర్సయ్య, బి.సైదులు, వెంకటేశ్వర్లు, ఉపేందర్, తవడబోయిన కృష్ణ, శ్రీకాంత్, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వనజీవికి డీఏఓల ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మంరూరల్/ఖమ్మంసహకారనగర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యకు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోహియుద్దీన్, సంఘం సభ్యులు శుక్రవారం రెడ్డిపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి రూ.10వేలు ఆర్థిక సాయమందించారు. రామయ్య పర్యావరణానికి చేస్తున్న సేవలకు గాను ఈ సాయం అందించినట్లు మోహియుద్దీన్ తెలిపారు. అలాగే నగరంలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖలోని వర్క్స్ అండ్ ప్రాజెక్ట్ విభాగంలో పని చేసి ఇటీవల కోవిడ్‌తో మృతి చెందిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) రవికుమార్ సంతాప సభ నిర్వహించగా.. మోహియుద్దీన్‌తో పాటు పలువురు హాజరైన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ది టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు పోటు రంగారావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

రఘునాథపాలెం: గ్రామాల్లో వానాకాలం ఆరంభానికి ముందే ఈనెల 23 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిలు మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం గ్రామాల్లో తాగు నీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్, డ్రెయిన్లను శుభ్రం చేయించడం, ప్రభుత్వం సంస్థల ఆవరణం, వీధుల వెంట చెత్త, కంపచెట్లు తొలిగింపు, లీకవుతున్న తాగు నీటి పైపు లైన్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు ఎంపీఓ తెలిపారు.

కేబినెట్ నిర్ణయాలపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: సీఎంకేసీఆర్ నేతృత్వాన జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ ఎమ్మెల్యే బానోత్‌చంద్రావతి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వీఆర్‌ఏల రెగ్యులరైజేషన్, కొత్తగా మండలాల్లో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, పది రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీతో పాటు ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపుపై ఆమె సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జర్నలిస్టులకు స్థలం మంజూరు చేయించడం ద్వారా వారి కలలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నెరవేర్చారని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు సుందరయ్య

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించిన ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం సుందరయ్య వర్ధంతి వేడుకలను సీపీఎం ఆధ్వర్యాన ఆయా మండల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: సుందరయ్య భవనంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో నివాళులర్పిస్తున్న నాయకులు



నేలకొండపల్లి: బైరవునపల్లిలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి